భూముల రీసర్వేలో శ్రద్ధ అవసరం

జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్



కణమాం గ్రామంలో పర్యటిస్తున్న జేసీ విశ్వనాథన్, అధికారులు

ఆనందపురం: భూముల రీ సర్వేను అధికారులు సక్రమంగా నిర్వహించాలని జేసీ విశ్వనాథన్ ఆదేశించారు. మండలంలోని కణమాంలో జరుగుతున్న రీ సర్వేను ఆయన శనివారం పరిశీలించారు. కణమాం రెవెన్యూ గ్రామంలో ఉన్న భూముల వివరాలు, ఇంతవరకూ జరిగిన సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. జిరాయతీ, ప్రభుత్వ భూముల సరిహద్దుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. త్వరగా సర్వే పూర్తి చేసి సేకరించిన అంశాలతో రికార్డుల్లో నమోదుకు చర్యలు తీసుకోవాలని జేసీ విశ్వనాథన్ ఆదేశించారు. ఆయనవెంట తహసీల్దార్ రామారావు తదితరులు ఉన్నారు.

నారాయణరాజుపేటను సందర్శించిన జేసీ

తగరపువలస: భీమిలి మండలం నారాయణరాజుపేట పంచాయతీ కార్యాలయాన్ని జేసీ కేఎస్ విశ్వనాథన్ శనివారం సందర్శించారు. పంచాయతీలో 431 ఎకరాల ఇనాం భూముల సెటిల్‌మెంట్‌కు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరి 15న ఆర్డీవో భాస్కరరెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్, అలాగే ఈ నెల 9న డీటీ శ్రీనివాసరావు సమక్షంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామసభలకు సంబంధించి అధికారులు ఏ విధంగా రికార్డులు తయారు చేశారో తనిఖీ నిమిత్తం ఆయన వచ్చారు. ఈ విషయం తెలిసి లక్ష్మీపురం, శింగనబందకు చెందిన 30 మంది రైతులు నారాయణరాజుపేట పంచాయతీ కార్యాలయానికి చేరుకుని జేసీకి తమ సమస్యలు చెప్పుకున్నారు. ఏళ్ల తరబడి సాగులో ఉన్న రైతులకు భూమి సొంతమవుతుందని చట్టాలు చెబుతున్నాయని, దాని ప్రకారం సాగులో ఉన్న రైతుల పేరిట పట్టాలు ఇవ్వాలని కోరారు. లేదంటే తమకు మరణమే మార్గమని విన్నవించారు. దీనిపై జేసీ స్పందించి 1961, 62లో 21 ఎకరాలను ఎనిమిది మంది రైతులకు మైనర్ పట్టాలు ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఒకరి పేరుతో ఉన్న భూములను మరొకరి పేరున మార్చడం తమ వల్లకాదన్నారు. 1968లో కూడా సర్వే చేసి 178 ఎకరాలు రైతులకు ఇచ్చినట్టు తెలిపారు. ఒకవేళ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే వారు ఇచ్చిన డైరెక్షన్ ప్రకారం నడచుకుంటామన్నారు. అనంతరం జేసీ స్థానిక సర్పంచ్ కాదా సూర్యనారాయణతో మాట్లాడుతూ ఇనాం భూములపై ఆరా తీశారు. గతంలో జరిగిన తప్పిదాలు ఇప్పటి సమస్య జఠిలం కావడానికి కారణమని ఆయన జేసీ దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిసింది.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



గుడ్లవానిపాలెం వద్ద పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

కొమ్మాది: జి – 20 సదస్సు కోసం బీచ్ రోడ్డులో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా గుడ్లవానిపాలెం అమ్మవార్ల దేవాలయం సముదాయం, సాగర్‌నగర్, ఇస్కాన్ టెంపుల్ జంక్షన్, రాడిసన్ బ్లూ హోటల్ తదితర సాగరతీర ప్రాంత వ్యూ పాయింట్ల వద్ద జరుగుతున్న పనులను ఆయన శనివారం పరిశీలించారు. గుడ్లవానిపాలెం వద్ద జరగుతున్న పనుల నాణ్యతను పరిశీలించి టూవీలర్, ఫోర్ వీలర్ పార్కింగ్, పచ్చని మొక్కల పెంపకం, సందర్శకులు కూర్చునేందుకు ఆధునిక బెంచీల ఏర్పాటు, ఓపెన్ జిమ్, పిల్లల ఆట పరికరాలు ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా తీర ప్రాంతాల్లో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని, పది మంది గ్రీన్ అంబాసిడర్లను నియమించి సందర్శకులు వ్యర్థాలు బీచ్‌లో పడివేయకుండా నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. టూరిస్టు బస్సులను పద్ధతి ప్రకారం పార్కింగ్ చేయకపోతే అపరాధ రుసుం విధించాలని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మిని ఆదేశించారు. అనంతరం సాగర్‌నగర్ బీచ్ పాయింట్ వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. మేజర్ డ్రైనేజీలో సిల్ట్ తీసివేసి, చుట్టూ మొక్కలు అమర్చి అందంగా తీర్చి దిద్దాలని ఆదేశించారు. ఎలక్ట్రికల్ విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ రోప్ లైట్లను అందంగా అమర్చాలని తెలిపారు. సాగరతీరం వెంట నిర్దేశించిన వ్యూ పాయింట్లలో ఆహ్లాదం కలిగించేలా పచ్చదనం పెంపొందించడం, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రాంతాలను తెలిపే సూచిక బోర్డుల ఏర్పాటు పనులు మరో రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈలు శ్యాంసన్‌రాజు, వినయ్‌కుమార్, డీడీహెచ్ ఎమ్.దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం నేడు

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లో ఆటో స్టాండ్ వద్ద ఆదివారం విజయనగరం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు గ్రామీణ వైద్యుల సంఘం పద్మనాభం మండల అధ్యక్షుడు ఆర్.అప్పారావు తెలిపారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం నిర్వహిస్తామని తెలిపారు.

నిత్యావసర సరకుల అందజేత



పాఠశాల యాజమాన్యానికి సామగ్రి అందజేస్తున్న యూనియన్ నాయకులు

కొమ్మాది: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా శనివారం సాగర్ నగర్ ప్రభుత్వ అంధుల బాలికల పాఠశాలకు నిత్యావసర సరకులు, విద్యార్థులకు దుస్తులు, మైక్ సిస్టమ్ అందజేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.వి.ఎస్.ఎస్.హరివర్మ, ఎమ్.శ్రీనివాస్ కుమార్, కార్యవర్గ సభ్యులు ప్రసన్న లక్ష్మి, మహీంద్ర, అడారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రైతుల ఆందోళన

పద్మనాభం: ల్యాండ్ పూలింగ్‌లో తమ భూములు తీసుకున్న రెవెన్యూ అధికారులు న్యాయం చేయాలని నరసాపురం రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. రెండు వందల ఎకరాల భూమిని జగనన్న పట్టణ అభివృద్ధి పథకం కాలనీ ఇళ్లకు తీసుకుని మూడేళ్లు కావస్తున్నా ఇంతవరకు తమకు ప్రభుత్వ పరంగా ఎకరాకు రావల్సిన 450 చదరపు గజాల స్థలాలు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు లాటరీ ద్వారా రోడ్డుకు దూరంగా స్థలాలు కేటాయిస్తామనడం సరికాదని మండిపడ్డారు. కాలనీ ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకున్నారని ఎం.అప్పలనాయుడు, కె.శ్రీను, ఎస్.అప్పలరాజుపై కేసులు పెట్టడం అన్యాయమంటూ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు తహసీల్దార్ వేణుగోపాలరావుకు వినతిపత్రం ఇచ్చారు.

డ్రైనేజీలో వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలు తొలగిస్తున్న శానిటరీ సిబ్బంది

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రాజీవ్‌నగర్ ప్రధాన రహదారి వెంట డ్రైనేజీల్లో మురుగు నీరు నెలల తరబడి నిల్వ ఉండడంతో 'దుర్వాసనతో ఇక్కట్లు' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి స్పందించారు. శనివారం ఉదయం ఇక్కడి డ్రైనేజీల్లో శానిటరీ సిబ్బంది పూర్తి స్థాయిలో వ్యర్థాలు తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గీతంలో హ్యాక్‌థాన్

కొమ్మాది: కంప్యూటర్ సైన్స్ కోర్సు అభ్యసించే విద్యార్థుల్లో కోడింగ్‌పై గల నైపుణ్యాలను ప్రోత్సహించడానికి గీతంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగు విభాగం, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా శనివారం కోడ్ పర్‌స్యూట్ పేరిట హ్యాక్‌థాన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి ఆర్.శిరీష మాట్లాడుతూ ఐటీ రంగంలో కోడింగ్‌కు గల ప్రాధాన్యత దృష్ట్యా విద్యార్థులు సంబంధిత అంశాలపై లోతైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రాంగణ నియామకాల్లో విద్యార్థులు ఎంపికయ్యేందుకు కోడింగ్ సామర్థ్యం కీలకమన్నారు.

శ్రీవారి ఆలయానికి వంట పాత్రల వితరణ



సామగ్రిని టీటీడీ అధికారికి అందిస్తున్న దాతలు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్ రామారావు రూ.1.25 లక్షల విలువ చేసే ఫ్రిడ్జ్, గ్రైండర్, 41 రకాల వంట పాత్రలు శనివారం టీటీడీ అధికారులకు అందజేశారు. శ్రీవారి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఇవి అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శేషుబాబు, భ్రమరాంబిక సేవా సమితి కో ఆర్డినేటర్ పి.విజయ, పీవీఎస్ఎమ్ రావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎస్వీబీసీ అడ్వైజర్

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఎస్వీబీసీ (టీటీడీ) తిరుపతి అడ్వైజర్ ఏఎస్ దుర్గారావు శ్రీ వారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆయన అంతరాలయంలో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం టీటీడీ అర్చకులు వేదాశీర్వాదం అందజేయగా ఆలయ ఏఈవో రమేష్, ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణరాజు ప్రసాదం అందజేశారు.

నర్సింగ్ వృత్తితో ఆత్మసంతృప్తి

కొమ్మాది: నర్సింగ్ వృత్తికి వైద్య రంగంలో ప్రపంచ వ్యాప్తంగా అధిక డిమాండ్ ఉందని, అదే సమయంలో మనిషి ప్రాణాలు కాపాడుతున్నామన్న ఆత్మసంతృప్తి లభిస్తుందని యూకేలోని లండన్ రాయల్ బ్రాంప్టన్ వైద్యాలయం నిపుణురాలు అనురాధ అన్నారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో 'నర్సింగ్ వృత్తి – అవకాశాలు' అనే అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. నర్సింగ్ వృత్తిలో రాణించాలంటే అంకితభావం, రోగుల పట్ల శ్రద్ధ, సేవానిరతి, చక్కటి భావప్రకటన సామర్థ్యం అవసరమని ఆమె సూచించారు.

మధురవాడలో విస్తృత తనిఖీలు



కొమ్మాది జంక్షన్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మధురవాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. శనివారం సాయంత్రం మధురవాడ పరిసర ప్రాంతాలు, కొమ్మాది జంక్షన్‌లో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సునీత తదితరుల ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు చేశారు.

ప్రశాంత పోలింగ్‌కు ఏర్పాట్లు



చంద్రంపాలెం హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సనపల రమణయ్య

మధురవాడ: ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని విశాఖ రూరల్ తహసీల్దారు సనపల రమణయ్య చెప్పారు. మండలంలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్, తోలగరువు హైస్కూళ్లలో 6 చొప్పున, సాగర్‌నగర్ స్టెల్లా మేరీ స్కూల్‌లో 3 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో లైటింగ్, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఆయనతోపాటు మల్లేశ్వరరావు ఉన్నారు.

నియోజకవర్గంలో 13 పోలింగ్ కేంద్రాలు

తగరపువలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి భీమిలి నియోజకవర్గంలో 285 నుంచి 297 వరకు 13 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మధురవాడ జోన్ పరిధిలో ఓటర్లకు చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో 285, 286, 287, 288 కేంద్రాలు కేటాయించారు. సాగర్‌నగర్, ఎండాడ, బీచ్‌రోడ్డులోని ఓటర్లకు మేరీ స్టెల్లా ఇంగ్లిష్ మీడియం స్కూల్ (సాగర్‌నగర్)లో 289, 290, 291 పోలింగ్ కేంద్రాలు కేటాయించారు. పద్మనాభం మండల ఓటర్లకు పద్మనాభం జెడ్పీ హైస్కూల్‌లోని 292 పోలింగ్ కేంద్రం, ఆనందపురం మండల పరిధిలో ఓటర్లకు ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లోని 293, 294 పోలింగ్ కేంద్రాలు కేటాయించారు. భీమిలి అర్బన్, రూరల్ గ్రాడ్యుయేట్ ఓటర్లకు భీమిలి నూకాలమ్మ ఆలయం వద్ద జీవీఎంసీ ఎంఎఫ్‌సీ ప్రాథమికోన్నత పాఠశాలలో 295, 296, సంతపేటలోని అంబేడ్కరు జీవీఎంసీ హైస్కూల్‌లో 297 నంబరు పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఈ పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయా మండలాల తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భీమునిపట్నం: భీమిలి పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. ఎగువపేట సమీపంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద 295, 296 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే చిట్టివలస అంబేడ్కర్ ఉన్నత పాఠశాల వద్ద 297, ప్లస్ 1 కింద రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల పరిధిలో మొత్తం 4,156 మంది ఓటర్లు ఉన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించాలి



పాఠశాలలో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న భీమిలి ఎంఈవో బాలామణి

తగరపువలస: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాలు గుర్తించి ప్రోత్సహిస్తే వారు దేశాభివృద్ధికి దోహదపడతారని ఎంఈవో కేపీ బాలామణి అన్నారు. చిట్టివలసలోని శ్రీశారద పబ్లిక్ స్కూల్‌లో ఎగ్జిబిషన్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ అన్ని రకాల వసతులు కల్పిస్తుందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా విద్యార్థుల ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు సోపానాలు వేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆర్ట్, సైన్స్‌కు సంబంధించి 700 రకాల నమూనాలను విద్యార్థులు ప్రదర్శించగా యాజమాన్యం 30 రకాల వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేసింది. డైరెక్టర్ డాక్టర్ అనుపమ జ్యోతిర్మయి, కరస్పాండెంట్ ఎస్‌ఏ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

దాబాగార్డెన్స్: ఉగాది విశిష్ట ప్రతిభారత్న–2023 పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సర్వేజనా సుఖినోభవంతు సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది విశిష్ట ప్రతిభా రత్న పురస్కారంతో ఈ నెల 26న హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించనున్నట్టు పేర్కొన్నారు. ఆయా రంగాల్లో సేవలందిస్తున్న వారు దరఖాస్తులను 20వ తేదీలోగా సర్వేజనా సుఖినో భవంతు, 1–20–164, గోకుల్‌నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్ –15 చిరునామాకు పంపాలని సూచించారు.

సుధాకర్ గెలుపుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఎండాడలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



లక్ష్మీపురం హైస్కూల్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం: సుందర విశాఖ నగరం పరిపాలన రాజధానిగా మారనున్న తరుణంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. చైతన్య విద్యా సంస్థల్లో పనిచేస్తున్న పట్టభద్రులతో మాట్లాడుతూ సీతంరాజు సుధాకర్ విద్యావేత్త, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి అన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో చైతన్య విద్యా సంస్థల ఏజీఎం రమణ, ప్రిన్సిపాల్ ఆదినారాయణ, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, వైఎస్సార్ సీపీ 6, 7 వార్డుల అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, నాయకులు పిల్లా సూరిబాబు, పిల్లా సత్యనారాయణ, సియాద్రి కనకరాజు, రాయన సాయికుమార్, పోతిన యర్రాజీ, జామి శివకుమార్ పాల్గొన్నారు.

తగరపువలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం భీమిలిలో ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మండలంలోని లక్ష్మీపురం, మజ్జిపేట జెడ్పీ హైస్కూళ్లలో ఉపాధ్యాయులను కలిసి వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయనవెంట వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, మజ్జి సూరినాయుడు, ఎంపీటీసీ సభ్యులు చెల్లూరి నగేష్, మజ్జి శ్రీనివాసరావు, నాయకులు కేపీ సత్యనారాయణ, మద్దిల వెంకటరమణ, పొట్నూరు చంద్రశేఖర్, కరుభుక్త జోగినాయుడు, కరుభుక్త వెంకటరమణ, కనకల వెంకటరమణ, కరుభుక్త వెంకన్న, గాడు తాతినాయుడు, గుడ్డాల ఎల్లయ్య, తుపాకుల అప్పలరాజు, తుపాకుల అప్పలస్వామి పాల్గొన్నారు.

- మజ్జివలస జెడ్పీ హైస్కూల్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, అమనాం హైస్కూల్‌లో ఎంపీపీ దంతులూరి వాసురాజు, సర్పంచ్ దంతులూరి ఉమాదేవి ప్రచారం చేశారు.
- జీవీఎంసీ రెండో వార్డులో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, నాయకులు సరగడ నాగిరెడ్డి, కంచుబోయిన వెంకటరావు, జగన్నాథ ఎల్లాజీ, చేట్ల ఎల్లయ్యరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, చిల్ల ప్రమీల, చేట్ల అప్పలసూరమ్మ, మద్ది మహాలక్ష్మి ప్రచారం చేశారు.
- జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలసలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, కుంచా శివరామకృష్ణ, దుంప సాయిరెడ్డి, పందిరి విజయ్, అక్కరమాని చినబాబు, సిమ్మల ప్రసన్న, రొక్కం శ్రీను, చెల్లూరు అచ్యుతరావు తదితరులు సీతంరాజు సుధాకర్ తరఫున ప్రచారం చేశారు.

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడ, రాజీవ్‌నగర్ ముబారక్ కాలనీల్లో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కార్పొరేటర్ లొడగల అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి శనివారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, మాదు చంటి, లొడగల రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: రేఖవానిపాలెంలో పట్టభద్రుల వద్దకు సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు వెళ్లి వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు ఓట్లు వేయాలని శనివారం ప్రచారం చేశారు. ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి చెందాలంటే సుధాకర్‌ను తప్పకుండా గెలిపించాలని కోరారు. ఉప సర్పంచ్ పి.గంగ శ్రీను, పి.కొండమ్మ, ఎం.మహేష్ పాల్గొన్నారు.



సంతపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రేఖవానిపాలెంలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ సమిడి శ్రీనివాసరావు



పీఎం పాలెం చైతన్య జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

అక్షయపాత్ర వంటశాలలో ఐఐఎం విద్యార్థుల అధ్యయనం



వివరాలు తెలుసుకుంటున్న ఐఐఎం విద్యార్థులు

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న అక్షయపాత్ర వంటశాలను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) విద్యార్థులు శనివారం సందర్శించారు. విద్యాభ్యసనలో భాగంగా వారు వంటశాలలో వివిధ ప్రక్రియలపై అధ్యయనం చేశారు. ఐఐఎం ప్రొఫెసర్ పి.ఆర్.ఎస్.శర్మ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులు వంటశాలను సందర్శించారు. అక్కడి ఫుడ్ ల్యాబ్, స్టోర్, వంటకు వినియోగిస్తున్న యంత్రాలు, కూరగాయల కొనుగోలు, వాటి నిల్వ, ఆహార పదార్థాల తయారీ, వాహనాలతో ఆహార పదార్థాల తరలింపు తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అన్ని విషయాలు నిశితంగా పరిశీలించారు. భవిష్యత్‌లో కొత్త అంశాలు తెలుసుకునేందుకు ఈ అధ్యయనం ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులు తెలిపారు. అక్షయపాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు అంబరీస, ప్రతినిధులు యదురాజా దాస స్వామీజీ, ప్రవీణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రాధికకు అవార్డు



డాక్టర్ రాధికకు అవార్డు అందజేస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

పీఎం పాలెం: రేడియో సిటీ ఐ కాన్ 2022 – 23 సంవత్సరానికి ఓబిస్ట్రిక్ అండ్ గైనకాలజీ అవార్డు స్థానిక వేదాంత హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ రాధికకు లభించింది. ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రేడియో సిటీ ఐ కాన్ ఆఫ్ ఇయర్ అవార్డులను నగరంలో అందించారు. గైనకాలజీలో అందిస్తున్న సేవలకు రాధికను ఎంపికచేసి జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు. అవార్డు సాధించిన రాధికను వేదాంత హాస్పిటల్ ఎండీ డాక్టర్ శివ, డాక్టర్ ప్రకాష్ అభినందించారు.

ఏప్రిల్ 9న హెచ్‌ఆర్‌సీ సర్వసభ్య సమావేశం

దాబాగార్డెన్స్: ఏప్రిల్ 9న దాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కుల కౌన్సిల్(హెచ్‌ఆర్‌సీ) సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని కౌన్సిల్ కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో భాగంగా మానవ హక్కుల పరిరక్షణలో పౌరుడి పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న వారిని ఆహ్వానించి వారి సూచనలు, సలహాలు స్వీకరిస్తామన్నారు. సర్వసభ్య సమావేశానికి హైకోర్టు న్యాయమూర్తులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటుతోపాటు రాష్ట్ర గవర్నర్‌గా నియమితుడైన జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు మానవ హక్కుల పటిష్టతకు చేపట్టాల్సిన చర్యపై నివేదిక అందజేయనున్నట్టు పేర్కొన్నారు. జూలై నాటికి 25 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌లు, సభ్యులను ఆహ్వానించనున్నట్టు చెప్పారు. హక్కుల ఉల్లంఘనతో బాధితులైన వారి హక్కుల పరిరక్షణకు 25 ఏళ్లుగా కౌన్సిల్ పోరాడుతోందన్నారు. బాలలు, మహిళల హక్కులు, పర్యావరణ హక్కులపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. రాజకీయాలకతీతంగా హక్కుల పరిరక్షణకు శ్రమిస్తున్న వారిని మాత్రమే తమ సంస్థ ప్రోత్సహిస్తుందన్నారు. సమావేశంలో వీఎస్ఎన్ మూర్తి, ఎస్వీ రమణ, అబ్దుల్ సత్తార్, రావాడ నాయుడు, మాధవి గణపతి, నక్కాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.